ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY 3 తిరుపతి జిల్లా వార్తలు

శుక్రవారం 7 నవంబరు 2025


నీళ్లలో కొట్టుకుపోతున్న పశువులు


కళత్తూరు దళితవాడను ముంచెత్తిన చెరువు నీరు




నీట మునిగిన పొలాలు


మంచంపై వృద్ధురాలి తరలింపు



జల విలయం

మేట వేసిన బురద.
పశువుల కళేబరాలు.
విరిగి పడిన కరెంటు స్తంభాలు.
కొట్టుకొచ్చిన ట్రాక్టర్లు, ఆటోలు.
దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు.
ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు..
బురద మట్టి.
రాయలచెరువు కట్ట తెగడంతో కేవీబీపురం కళత్తూరు దళితవాడలో జలవిలయం సృష్టించిన భీతావహ దృశ్యమిది.
ముందస్తు సమాచారంతో జనం మిద్దెలెక్కారు. ఎత్తయిన చోట్లకు వెళ్లారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. సునామీలా విరుచుకు పడిన వరద ఉధ్రుతిలో ఊరటనిచ్చే విషయం ఇది.

- కేవీబీపురం/సత్యవేడు/శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

- ఓళ్లూరు రాయల చెరువుకు గండి
- ముంచెత్తిన నీటితో బురదమయమైన కళత్తూరు దళితవాడ
- పాడి పశువులు, జీవాలు మృతి
- ముందస్తు సమాచారంతో తప్పిన ప్రాణనష్టం

రాత్రి వేళ జరిగి ఉంటే..

రాయల చెరువు కట్ట రాత్రి.. లేదా తెల్లవారుజామున తెగి ఉంటే.. ఈ ఆలోచనకే కళత్తూరు దళితవాడ వణికిపోతోంది. తామంతా నిద్రించే వేళ చెరువు నీరు ముంచెత్తిఉంటే.. ప్రాణాలతో బయటపడే వాళ్లం కాదని అంటున్నారు. సర్వం కోల్పోయినా ప్రాణాలు దక్కాయని చెబుతున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే..

పాతపాళెంలో రెండు కొండల మధ్య 153 ఎకరాల విస్తీర్ణంలో రాయల చెరువు ఉంది. మూడు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. చెరువు నీటి సామర్థ్యం 0.88 టీఎంసీలు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకంలో భాగంగా చెరువు కట్టను పటిష్ఠ పరిచింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెరువు కట్టల నిర్వహణను గాలికొదిలేసింది. ఈ నిర్లక్ష్యమే రాయల చెరువు కట్ట తెగడానికి కారణమని స్థానికులు అంటున్నారు. ఈ చెరువు ఖాళీ కావడంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు.

సర్వంకోల్పోయిన వారెందరో?

పది అడుగుల మేర నీటి ప్రవాహంతో చాలా ఇళ్లల్లోని వస్తువులు కొట్టుకుపోయాయి. ఇళ్లల్లోని ధాన్యం, బియ్యం, నగదు, సర్టిఫికెట్లు, గృహోపకరణాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ట్రాలీలు, చెనిక్కాయమిషన్ వంటివి నీటిలో కొట్టుకుని ఎక్కడ పడితే అక్కడ చెల్లా చెదరుగా పడ్డాయి.500కుపైగా ఆవులు, గేదెలు చనిపోయినట్లు అంచనా. మిగిలినవి గల్లంతయ్యాయి. మేకలు, గొర్రెలు, కోళ్లు ఎన్ని చనిపోయాయో తెలియదు. కళత్తూరు, కళత్తూరు దళితవాడల్లోని ఇళ్లల్లో బురద పేరుకుపోవడంతో సామాన్లు పనికిరాకుండా పోయాయి. చాలామంది కట్టుబట్టలతో బయటపడ్డారు. వందకుపైగా విద్యుత్‌స్తంభాలు నేలమట్టం అయ్యాయని అంచనా. పంటలు దెబ్బతినగా, పొలాలన్నీ ధ్వంసమయ్యాయి.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాల, జడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 900 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. నాలుగురోజుల పాటు వీరికి బస, ఆహారం అందించనున్నారు. ప్రతి కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.3వేలతో పాటు నిత్యావసర సరుకులు అందజేయనున్నారు.


ఆదర్శ పాఠశాలలో..

ఇలా ముంచెత్తింది

గురువారం ఉదయం 6 గంటలు: ఓళూరు రాయలచెరువుకు గండి పడింది. దీనిని గుర్తించిన రైతులు, కూలీలు పాతపాళెం, ఓళూరు, వేమలపూడి, ఎస్ఎల్ పురం, కళత్తూరు ప్రజలను అప్రమత్తం చేశారు. **7 గంటలు:** పాతపాళెం ఎస్టీ కాలనీ నుంచీ కళత్తూరులోకి చెరువునీరు వచ్చింది. **8 గంటలు:** గండి కాస్త పెద్దది కావడం.. కట్ట తెగిపోవడంతో ప్రవాహం ఉధ్రుతంగా మారింది. **9 గంటలు:** వరద.. ఉప్పెనలా మారి కళత్తూరు దళితవాడపై విరుచుకుపడింది. 10 నుంచి 12 అడుగుల ఎత్తు వరకు ప్రవహించింది. ప్రజలు మిద్దెలపై ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు. **10 గంటలు:** వరద ప్రవాహం కొనసాగుతూ గ్రామాన్ని ముంచెత్తింది. గంటన్నర వ్యవధిలో కకావికలం చేసింది.


కొట్టుకొచ్చిన ట్రాక్టర్


చనిపోయిన పశువుల వివరాల సేకరణ

కొనసాగుతున్న సహాయక చర్యలు

ఎమ్మెల్యే ఆదిమూలం, ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ గ్రామానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు వరద నీటి మళ్లింపు, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను ప్రారంభించారు. సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరు నుంచి అగ్ని మాపక సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, సమీప గ్రామాల వారు ప్రజలకు ఆహారం, నీరు అందించారు. నిరాశ్రయులకు రైతు సంఘం అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులనాయుడు తదితరులు మధ్యాహ్న భోజనం, తాగునీటి వసతి కల్పించారు.వ్యవసాయ, పశుసంవర్థక శా ఖ అధికారులు నష్టం వివరాలు సేకరిస్తున్నారు.నవంబరు చివరిలో నాట్లు వేసేందుకు రైతు లు నార్లు పోస్తున్నారు. దీంతో వేలాది ఎకరాల్లో పంట నష్టం తప్పింది. కాగా, సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్ దళితవాడలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ధైర్యం చెప్పారు. కాగా, ఈ చెరువు నీళ్లు కాళంగి రిజర్వాయరులోకి చేరడంతో కొంత నీటిని బయటకు వదిలి.. మళ్లీ గేట్లు మూసేశారు.



ఆస్తి నష్టం రూ.30 కోట్లు!

6


జల విలయం మిగిల్చిన క(న)ష్టం

మాజీ మంత్రి రోజాకు పరాభవం

- వడమాలపేట ఎంపీపీపై వీగిన అవిశ్వాసం
- డుమ్మా కొట్టిన నలుగురు ఎంపీటీసీలు

తిరుపతి/ వడమాలపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గంలో.. అందునా సొంత పార్టీలోనే మాజీ మంత్రి రోజాకు మరో సారి పరాభవం ఎదురైంది. గత ఐదేళ్లు బలమైన నేతలను వ్యతిరేకం చేసుకుని పలుమార్లు పార్టీపై పట్టు కోల్పోయే పరిస్థితి తెచ్చుకున్న ఆమె.. తాజాగా వడమాలపేట ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం విషయంలోనూ ఎదురుదెబ్బ తిన్నారు. వడమాలపేట మండలంలో 9 ఎంపీటీసీ స్థానాల్లో.. రెండింటికి కోర్టు కేసుల కారణంగా ఎన్నికలు జరగలేదు. మిగిలిన ఏడూ వైసీపీయే గెలుచుకుంది. ఎంపీపీ పదవి బీసీ మహిళకు రిజర్వు అయింది. ఇద్దరు ఎంపీపీ పదవిని ఆశించడంతో మధ్యేమార్గంగా తొలి రెండున్నరేళ్లు విజయలక్ష్మి, మలి సగం ఏఎం పురం ఎంపీటీసీ పుష్పలత ఎంపీపీగా కొనసాగేలా అంతర్గతంగా ఒప్పందం కుదిరినట్టు సమాచారం. ఇదంతా అప్పటి మంత్రి రోజా సమక్షంలోనే జరిగినట్టు ఆ మండల వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికి నాలుగేళ్లు దాటినా నాటి ఒప్పందం అమలు కాలేదు. దీనిపై ఎన్నిసార్లు పంచాయితీలు జరిగినా ఒప్పందం మేరకు ఎంపీపీ పదవీ మార్పిడి జరగలేదు. దీంతో ఏడుగురు ఎంపీటీసీలలో ఎంపీపీ మినహా మిగిలిన ఆరుగురూ కలిసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ ఆరుగురికీ మాజీ మంత్రి రోజా మద్దతు ఉందన్న ప్రచారం జరిగింది. ఆమె సూచనల మేరకే గత నెల 15వ తేదీన ఆరుగురు ఎంపీటీసీలూ తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌ను కలసి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారని తెలిసింది. తిరుపతి ఆర్డీవో గురువారం వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఏడుగురు ఎంపీటీసీలు ఉండగా ఏఎంపురం, పత్తి పుత్తూరు ఎంపీటీసీలు పుష్పలత, పద్రిమ మాత్రమే హాజరయ్యారు. అదనంగా గంట సమయం కేటాయించినా మిగిలిన వారు రాలేదు. అవిశ్వాస తీర్మానం అందించిన ఆరుగురిలో నలుగురు గైర్హాజరు కావడం గమనార్హం. కోరం లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగి పోయినట్లు ఆర్డీవో రామ్మోహన్ ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరి రావు, ఏవో హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


అవిశ్వాస తీర్మాన దరఖాస్తును పరిశీలిస్తున్న ఆర్డీవో

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ డయల్ యువర్ ఈవో కార్యక్రమం శుక్రవారం తిరుమలలో జరుగనుంది. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్షప్రసారం చేస్తారు. తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై భక్తులు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌తో ఫోన్ ద్వారా మాట్లాడవచ్చు. ఇందుకోసం 0877 2263261 నెంబరును సంప్రదించాలి.

శ్రీవారి సారె ట్రయల్ రన్ విజయవంతం

తిరుచానూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు పంచమి తీర్థం నాడు తిరుమల నుంచి అమ్మవారికి ఏటా శ్రీవారి సారె తీసుకొస్తారు. తిరుపతిలోని కోమలమ్మ సత్రం నుంచి తిరుచానూరుకు గజరాజులపై ఊరేగింపుగా తీసుకువస్తారు. పంచమి తీర్థం నాడు అశేష భక్తజన కోటి తిరుచానూరుకు వస్తుంది. ఏనుగులు బెదరకుండా ముందస్తుగా ఆ మార్గాన్ని వాటికి పరిచయం చేయడానికి శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గురువారం ఉదయం నగరంలోని చెన్నారెడ్డి కాలనీ నుంచి శ్రీవారి సారె ఊరేగింపు ట్రయల్ రన్ నిర్వహించారు. గజరాజులపై నమూనా సారెను ఊరేగింపుగా కోదండరామాలయం, చిన్నబజారు వీధి, గోవిందరాజస్వామిగుడి, బండ్ల వీధి, ఆర్టీసీ బస్టాండు, పూర్ణకుంభం సర్కిల్ మీదుగా పద్మావతీపురం, శిల్పారామం మీదుగా అమ్మవారి ఆలయం వరకు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవోలు హరీందర్‌నాథ్, శాంతి, వీజీవో గిరిధర్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, ఏఈవో దేవరాజులు, అర్చకుడు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గజరాజులపై శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

భక్తులతో కిటకిటలాడిన ముక్కోటి

చంద్రగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలలో గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, ఆనందవల్లిదేవికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ఆవరణలోని నటరాజ కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం దీపారాధన చేసి, స్వామి అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ముక్కోటి భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


శివపార్వతుల కల్యాణం చేస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా సిద్ధకాలభైరవ హోమం



నిమ్మకాయల అలంకారంలో కాలభైరవస్వామి, గారెలతో కాలభైరవ హోమం చేస్తున్న అర్చకులు

రామచంద్రాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాలభైరవ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో సిద్ధ కాలభైరవ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మవారితోపాటు కాలభైరవస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9 గంటలకు వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య సిద్ధ కాలభైరవ హోమాన్ని లక్ష గారెలతో పూర్తి చేశారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరనానందభారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతితో హోమాన్ని ముగించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. పీఠాధిపతులు భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పునిచ్చారు. నాగపట్ల ఈస్ట్ బీట్, చామల రేంజ్‌లోని నిషేధిత రిజర్వు ఫారెస్టు పరిధిలో ఎర్రచందనం చెట్లు నరికేందుకు తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన రవి, గోవిందన్ కొన్నాళ్ల కిందట శేషాచలం అడవుల్లోకి ప్రవేశించి పట్టుబడ్డారు. వీరిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ ఇద్దరు ముద్దాయిలను నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించారు. ఎర్రచందనం చెట్లను నరికేందుకు అడవిలోకి వెళ్లే నిందితులకు ఈ శిక్షలు ఒక ఒక హెచ్చరిక అవుతుందని టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

13న 'సివిల్ సర్వీసెస్' ఆటల పోటీలు

చిత్తూరు క్రీడలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా వాయిదాపడ్డ ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలు ఈనెల 13వ తేదీన చిత్తూరులోని డీఎస్ఏ మెసానికల్ మైదానంలో జరగనున్నాయి. ఈ మేరకు డీఎస్‌డీవో బాలాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 19 క్రీడాంశాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందినవారు ఈనెల 19 నుంచి 22వ తేదీవరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ లాన్ టెన్నిస్, హాకీ, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, డ్యాన్స్, మ్యూజిక్, షార్ట్‌ప్లే, రెజ్లింగ్‌లో పోటీలు నిర్వహిస్తారని వివరించారు.

పాఠశాలల పనిదినాలుగా రెండో శనివారాలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఈనెల నుంచి నాలుగు రెండో శనివారాలు పనిచేస్తాయని డీఈవో వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాను కారణంగా నాలుగు రోజులపాటు పాఠశాలల సెలవులు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యా సంవత్సరం పనిదినాలను పరిగణనలోకి తీసుకుని ఈనెల 8, డిసెంబరు 13, వచ్చే ఏడాది జనవరి 10, ఫిబ్రవరి 14వ తేదీల్లోని రెండో శనివారాల్లో పాఠశాలలు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇందులో మినహాయింపు ఉండదన్నారు.

గ్రేటర్‌లో రూరల్ పంచాయతీల విలీనంపై కసరత్తు

అభిప్రాయ తీర్మానాలు పంపాలని నోటీసులు

తిరుపతిరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతిలో రూరల్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల విలీనానికి సంబంధించి జిల్లా ఉన్నతాధికారవర్గాల నుంచి కసరత్తు మొదలైంది. దీనిలో భాగంగా మండలంలోని 34 పంచాయతీల పాలకమండళ్ల అభిప్రాయ తీర్మానాలను పంపాలని కోరుతూ ఈ నెల 4న జిల్లా పంచాయతీ అధికారి పేరిట నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో గురువారం ఎంపీడీవో చాంబర్‌లో ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్ నేతృత్వంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల ప్రజలకు లభించే సేవలు, అభివృద్ధి, సదుపాయాలు, పాలనాపరమైన ప్రయోజనాలను వివరించాలన్నారు. గ్రామ పంచాయతీ అభిప్రాయాన్ని తీర్మాన రూపంలో నోటీసు అందిన పది రోజుల్లోపు సమర్పించాలని కార్యదర్శులకు సూచించారు. కాగా ఇటీవల నిర్వహించిన రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో మెజారిటీ వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు మాట్లాడుతూ ఇప్పుడున్న గ్రామ పంచాయతీలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. అలాగే గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల పన్నులు పెరుగుతాయని అంటున్నారు. కాగా నగరపాలక మండలి సమావేశంలో వైసీపీకి చెందిన కార్పొరేటర్లు గ్రేటర్ తిరుపతిని ఆమోదించాలని ప్లకార్డులతో నిరసన తెలపగా, రూరల్ మండలంలో దీనికి భిన్నంగా అదే పార్టీ ప్రజాప్రతినిధులు వ్యతిరేకించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్

పొలాలపై ఏనుగుల మంద బీభత్సం

- మామిడి, వరి, కొబ్బరి పంటలకు అపారనష్టం



ధ్వంసమైన టమోటా పంటను చూపుతున్న కౌలు రైతు దామోదర్- ధ్వంసమైన వరిపంటను చూపుతున్న వెంకటస్వామి

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో రోజూ పంటలపై ఏనుగుల మంద బీభత్సం సృష్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో గజరాజుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అన్నదాతలపై కన్నెర్ర చేస్తున్న గజ రాజులు పంటలకు అపారనష్టం కలిగిస్తున్నాయి. అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని రైతులు పంటలపై ఏనుగులు దాడులు చేయడం పరిపాటిగా కొనసాగిస్తుండటంతో క్షణక్షణం భయం గుప్పిట్లో కాలం గడుపుతున్నారు. బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాల్సిన అటవీశాఖ తూతూమంత్రంగా పరిహారం చెక్కులు అందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని దేవళంపేట, అయ్యావాండ్లపల్లి పంచాయతీల్లో బుధవారం రాత్రి మామిడి, వరి, కొబ్బరిచెట్లపై ఏనుగుల మంద దాడులు చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. బుధవారం పగలంతా దేవళంపేట పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి సమీపంలోని మామిడితోటలో తిష్ఠ వేసిన 16 ఏనుగులు సాయంత్రం చీకటి పడే సమయానికి తోటలో నుంచి పొలాల వైపు అడుగులు వేశాయి. బాలిరెడ్డిగారిపల్లి, మునిరెడ్డిగారిపల్లి, నల్లగుట్టపల్లి, దిన్నెబెస్తపల్లి, చెరుకువారిపల్లి, వీకేపల్లి, కుమ్మరిపల్లి గ్రామాల్లో టమోటా, వరి, మామిడి, క్యాలీఫ్లవర్ పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తూర్పు విభాగం అడవిలోకి ఏనుగులు చేరుకున్నాయి. గురువారం పగలంతా సూరప్పచెరువు వద్ద ఏనుగులు తిష్ఠ వేసినట్లు ప్రజలు తెలిపారు. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను గురువారం ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మధుబాబు ట్రాకర్స్‌తో కలిసి పరిశీలించారు. అటవీ ప్రాంతం సరిహద్దులోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్ రెడ్డి

భాకరాపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్ రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రాధాన్యత రంగాలపై దృష్టి పెట్టాలన్నారు. పేదరిక నిర్మూలన కోసం మెరుగైన జీవనోపాధి కల్పించాలని, ఆరోగ్యకరమైన, స్నేహపూర్వక వాతావరణం ఉండేలా చూడాలని అన్నారు. నీరు, పచ్చదనం-పరిశుభ్రత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక న్యాయం, భద్రత తదిత రాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్ కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి


నరసింహారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగుడుపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే పులివర్తి నాని నివాళులర్పించారు. మండలంలోని గంగుడుపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు బండి వాసు తండ్రి బండి నరసింహారెడ్డి మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లి నరసింహారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వాసు కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, నాయకులు అగరాల జయచంద్రారెడ్డి ఉన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ


కోటి సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న అధ్యక్షుడు సింహాల మోహన్

భాకరాపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని భాకరాపేటలో గురువారం ఆ పార్టీ చిన్నగొట్టిగల్లు మండ లాధ్యక్షుడు సింహాల మోహన్ ప్రారంభించారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం వల్ల పేదలకు వైద్య విద్య దూరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి, జడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ భూపాల్ శంకర్ రెడ్డి, నాయకులు సీతాపతి, సుధాకర్, మహేందర్ రెడ్డి, గురుశంకర్ పాల్గొన్నారు.

కోటకాడపల్లెలో ఇంటింటా వైద్య సేవలు



ఎర్రావారిపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వర్షాలకు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. కోటకాడపల్లె పంచాయతీ మండల కేంద్రానికి దూరంగా, తలకోన అడవులకు సమీపంలో ఉంటుంది. గ్రామంలో ఏ ఒక్కరికి జ్వరం వచ్చిందని తెలిసినా గంటల వ్యవధిలో ఏఎన్ఎం లావణ్య, ఆశా సిబ్బంది వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య నియమాలు, సలహాలు ఇస్తున్నారు. విధి నిర్వహణలో వారి అంకితభావానికి గ్రామస్థులు అభినందిస్తున్నారు.

వైద్యవిద్యను పేదలకు దూరం చేయడం బాధాకరం


మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థులకు ప్రభుత్వం వైద్య విద్యను దూరం చేస్తోందని వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం మండలం నడవలూరులో గురు వారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయాలన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గణపతి రెడ్డి, గిరిధర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, జ్యోతి, పవన్‌కుమార్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి వెంకటేష్ పాల్గొన్నారు.

ఇనాం డీటీ పోస్టు చిత్తూరు నుంచి తిరుపతికి బదలాయింపు

తిరుపతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకూ చిత్తూరు జిల్లాలో ఉన్న ఇనాం డిప్యూటీ తహసీల్దారు పోస్టును రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జిల్లాకు బదలాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో తొలినుంచి ఇనాం డీటీ పోస్టు కొనసాగుతోంది. ఇనాం ఎస్టేట్ అబాలిషన్ యాక్ట్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇనాం భూములపై హక్కు పత్రాలు కలిగిన వారి దరఖాస్తులపై విచారించి సక్రమమని తేలితే రైత్వారీ పట్టాలు మంజూరు చేసే అధికారం ఐడీటీలకు ఉంటుంది. అలాగే ఇనాం భూములకు సంబంధించిన రికార్డులన్నీ కూడా ఐడీటీ ఆధీనం లోనే ఉంటాయి. ప్రభుత్వ నిర్ణయాలు, కోర్టు కేసుల్లో కూడా ఐడీటీల పాత్ర కీలకం. అయితే 2022లో జిల్లాల పునర్విభజన జరిగాక తిరుపతి జిల్లా ఏర్పాటు కాగా ఐడీటీ పోస్టు మాత్రం మంజూరు కాలేదు. ప్రస్తుత చిత్తూరు జిల్లాలో ఇనాం భూములు పెద్దగా లేవు. ఇనాం భూములు ఉన్నదంతా ప్రస్తుత తిరుపతి జిల్లా పరిధిలోనే. ప్రత్యేకించి తిరుపతి అర్బన్, రూరల్, రేణిగుంట, చంద్రగిరి తదితర మండలాల్లో వేల ఎకరాల ఇనాం భూములున్నాయి. ఈ భూములకు సంబంధించిన వివాదాలు కూడా ఇక్కడే అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి ఇనాం భూముల వ్యవహారాలలో కీలక పాత్ర పోషించాల్సిన ఐడీటీ పోస్టు లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ గతేడాది డిసెంబరులో ప్రభుత్వానికి లేఖ రాశారు. ఐడీటీ పోస్టు లేనందున పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం చిత్తూరు జిల్లా ఐడీటీ పోస్టును తిరుపతి జిల్లాకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కారు డ్రైవింగ్‌పై శిక్షణ

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 13 నుంచి 30 రోజుల పాటు ఉచితంగా పురుషులకు, మహిళలకు లైట్ మోటార్ వెహికల్ కారు డ్రైవింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి చదివి ఉండాలని వెల్లడించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒకసారి చార్జీలు ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం ధ్రువపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672లను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



చంద్రగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. తొండవాడ బస్టాండు కూడలిలో మంగళవారం ఉదయం 60 సంవత్సరాల వ్యక్తి రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి 108 వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. గురువారం దానికి సంబంధించిన సమాచారం అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు 9440796760, 6305024261లకు తెలియజేయాలని కోరారు.

దూడను చంపిన చిరుత


చిరుత పాదముద్రలు

ఐరాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం వడ్రాంపల్లె గ్రామంలో బుధవారం రాత్రి ఓ దూడను చిరుత చంపేసింది. పాడి రైతు కిషోర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తన పాడి ఆవును రాత్రి ఇంటి వద్ద కట్టేశాడు. దూడను ఇంటికి అర కిలోమీటరు దూరంలోని వ్యవసాయ పొలం వద్ద కట్టేశాడు. ఈ క్రమంలో దూడపై చిరుత దాడి చేసి చంపి.. తినేదింది. విషయం తెలుసుకున్న చిత్తూరు అటవీశాఖ డీఆర్వో కరణ్‌సింగ్ గురువారం సంఘటనా స్థలానికి విచ్చేశారు. అక్కడ చిరుత పాదముద్రలను గుర్తించారు. రైతులు తమ పశువులను వ్యవసాయ క్షేత్రాల వద్ద ఉంచొద్దని సూచించారు.

రోడ్డుపై శవ పంచాయితీ

- మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వని బంధువులు
- పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కారం


ఇంటికి తాళం వేసిన బంధువులు

శ్రీకాళహస్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ విబేధాలు రోడ్డుపై శవపంచాయతీకి దారితీశాయి. పోలీసుల జోక్యంతో చివరకు సమస్య పరిష్కారమైంది. వివరాలిలా.. పట్టణంలోని సినిమావీధికి చెందిన రమాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా రిటైర్డైంది. ఆమె కొన్నాళ్లు స్వగృహంలోనే ఉంది. అయితే కుటుంబ విబేధాలు కారణంగా కొద్ది సంవత్సరాల నుంచి కొడుకు సురేష్, మనవరాలు రిష్మికలతో కలిసి పుత్తూరులో ఉంటోంది. ఈ క్రమంలో అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. తల్లి కోరిక మేరకు కొడుకు సురేష్ ఆమె శవాన్ని అంతిమ సంస్కారాలు శ్రీకాళహస్తిలోని స్వగృహంలో నిర్వహించాలని భావించాడు. గురువారం ఉదయం మృతదేహాన్ని ఇంటి వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే ఆస్తి విబేధాల నేపథ్యంలో ఆ ఇంట్లో ఉంటున్న బంధువులు ససేమిరా అన్నారు. శవాన్ని ఇంట్లోకి రానివ్వమంటూ ఇంటికి తాళం వేశారు. దీంతో సురేష్ రోడ్డుపై బైఠాయించి శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ రవి సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. శవాన్ని ఇంట్లోకి తరలించాక అంతిమ సంస్కారాలను బంధువులు పూర్తిచేశారు.


ఇంటి ముందు మృతదేహంతో రమాదేవి కుమారుడు, కుమార్తె

శ్రీసిటీని సందర్శించిన ఏపీ ఎన్నికల కమిషనర్

సత్యవేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని, భర్త కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి అజయ్ ప్రకాష్ సాహ్నితో కలిసి గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు స్వాగతం పలికారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు మేకిన్ ఇండియా కార్యక్రమానికి సహకారం, ఉపాధి సృష్టి, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో శ్రీసిటీ పాత్రను వివరించారు.

జగన్ డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నారు

● శాప్ చైర్మన్ రవినాయుడు



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ నేత జగన్ రెడ్డి డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నారని శాప్ చైర్మన్ రవి నాయుడు విమర్శించారు. విశాఖలో వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండా రెడ్డి విద్యార్థులకు గంజాయి విక్రయిస్తూ దొరికిపోయినా పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోవడం ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ డ్రగ్స్ అమ్ముతూ దొరికిపోతే ఎలా తప్పించుకోవాలో శిక్షణ ఇచ్చేందుకే తాడేపల్లిలో వైసీపీ యువజన విభాగం నేతలతో జగన్ సమావేశమయ్యారని ఎద్దేవా చేశారు. వైసీపీ అంటేనే డ్రగ్స్, గంజాయి పార్టీ అని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఏపీని డ్రగ్స్, గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తోంద న్నారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నేత హేమంత్ రాయల్ పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో 'ఖ్యాతి'



ఖ్యాతిని అభినందిస్తున్న కోచ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు జరిగిన 37వ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో తిరుపతికి చెందిన కె.ఖ్యాతి అత్యుత్తమంగా రాణించింది. రోడ్ 5, రింక్ పాయింట్ టూ పాయింట్(5వేల మీటర్లు) విభాగాలలో బంగారు పతకాలు సాధించింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కోచ్ రాజేష్, క్రీడా ప్రముఖులు ఆమెను అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఓవరాల్ చాంపియన్ శ్రీపద్మావతి మహిళా కళాశాల జట్టు



మహిళా క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

తిరుపతి(క్రీడలు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో శ్రీపద్మావతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచింది. రూ.90వేలు నగదు బహుమతి గెలుచుకుంది. గురువారం కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపాల్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల పోటీల్లో రాణిస్తుండటం కళాశాలకు, టీటీడీకి గర్వకారణమన్నారు. ప్రశంసాపత్రాలు, మెడల్స్ షీల్డ్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి బి.భారతి, భద్రమణి, పద్మశ్రీ పాల్గొన్నారు.

శ్రీచైతన్య సిబ్బంది రక్తదానం



రక్తదానం చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం ప్రసాద్

తిరుపతి(విద్య), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీలక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా జీఎస్ మాడ వీధిలోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రక్తదానం చేశారు. విద్యాసంస్థల ఏజీఎం బీవీ ప్రసాద్ మాట్లాడుతూ లక్ష్మీబాయి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, మద్దతుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. పాఠశాలల ఏజీఎం సురేష్, విద్యాసంస్థల డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

డ్రాయింగ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

తిరుపతి(జీవకోన), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ పుణె వారు సెప్టెంబరులో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో నగర పరిధిలోని సత్యనారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదు బంగారు పతకాలు సాధించినట్లు హెచ్ఎం సంధ్యారాణి తెలిపారు. పెయింటింగ్‌లో సహీన, హ్యాండ్ రైటింగ్‌లో జ్యోత్స్ని ప్రియ, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లో జ్ఞానప్రకాష్ నాయక్, హ్యాండ్ రైటింగ్‌లో స్పందన, రంగోలిలో పొందూరు నవ్య ప్రతిభ చూపారు. గురువారం విద్యార్థులను, డ్రాయింగ్ మాస్టర్ శ్రీనివాసులును అభినందించారు.

టౌన్ బ్యాంకులో ఇళ్ల వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి(జీవకోన), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆరు తనఖా ఇళ్లకు బుధ, గురు వారాల్లో అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ ఆడివిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జనరల్ మేనేజరు రవికుమార్‌రెడ్డి, చీఫ్ మేనేజరు వెంకటేశన్, మేనేజర్లు వినోద్‌బాబు, చంద్రబాబు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 44 మందికి జరిమానా

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారి పర్యవేక్షణలో గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 44 మంది, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 17 మందిపై కేసులు నమోదు చేశారు. దీనిపై 3వ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సంధ్యారాణి విచారణ జరిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారికి రూ.500 చొప్పున జరిమానా విధించారు.

ఓవర్ లోడ్ ఆటోలను నియంత్రించాలి

తిరుపతి(రవాణా), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఓవర్ లోడ్ ఆటోలను నియంత్రించి ప్రమాదాలను అరికట్టాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. నగరంలో గతంలో ఉన్న టౌన్ సర్వీసులు కనుమరుగుకావడంతో ప్రజలు పూర్తిగా ఆటోలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో షేర్ ఆటోలు ఓవర్ లోడ్‌తో వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే ఆటోల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వర్షాల కారణంగా తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లోని రహదారులు గుంతలమయ మయ్యాయని వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రైతులను ఆదుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో గురువారం రాయలచెరువు కట్ట తెగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత ఒక ప్రకటనలో కోరారు. రాయల చెరువు కట్ట తెగిపోవడంతో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు కొట్టుకుపోయాయని తెలిపారు. పలువురు రైతులకు చెందిన గుడిసెలు పడిపోయాయని వివరించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే చెరువు కట్టలు తెగిపోతున్నాయని విమర్శించారు. మరమ్మతుల పేరుతో విడుదలైన నిధులను నాయకులు తినేసి తూతూ మంత్రంగా పనులు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే నష్టాన్ని అంచనా వేసి, త్వరితగతిన పరిహారం ఇవ్వాలని, పంట కాలువల ఆక్రమణలను తొలగించాలని కోరారు.

నీతి అయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ నేడు రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ సభ్యులు వీకే సారస్వత్ శుక్రవారం తిరుపతికి రానున్నారు. ఉదయం 11 గంటలకు ఎస్వీయూ సెనెట్ హాల్లో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ద ఇంజిన్ ఆఫ్ వికసిత భారత్-2047 అంశంపై సదస్సు ప్రారంభమవుతుంది. ఇందులో వీకే సారస్వత్ ప్రసంగిస్తారు.

నేడు ఎస్వీయూలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో శుక్రవారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు అన్నమయ్య భవన్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ - హ్యూమన్స్ రైట్స్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఎస్వీ క్యాన్సర్ హాస్పిటల్ సహకారం అందించనుంది. ఎస్వీ క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ సంధ్యారాణి, ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి, స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డైరెక్టర్ మురళీధర్ పాల్గొంటారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ కోరారు.

భద్రతపై ట్యాక్సీ డ్రైవర్లకు అవగాహన



డ్రైవర్లతో మాట్లాడుతున్న హరిప్రసాద్

తిరుమల, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఆస్థానమండపంలో గురువారం భద్రతా నిబంధనలపై ట్యాక్సీ డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం జరిగింది. తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, ఏఎంవీఐ వర్మ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ పలు సూచనలు చేశారు.

రాష్ట్రపతి పర్యటనలో లోపాలుండకూడదు

అధికారులతో అదనపు ఈవో వెంకయ్య చౌదరి



తిరుమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలూ ఉండకూడదని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులకు సూచించారు. రాష్ట్రపతి ఈనెల 20వ తేదీన తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని, తిరుమలకు చేరుకుంటారు. రాత్రి తిరుమలలోనే బసచేసి 21వ తేదీన ఆలయ సంప్రదాయం ప్రకారం ముందుగా వరాహస్వామిని, ఆ తర్వాత శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు. ఈ క్రమంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అదనపు ఈవో వివిధ విభాగాల అధికారులతో గురువారం సాయంత్రం తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనను దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో సమగ్ర ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శనం, బస, అన్నప్రసాదాల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ సీఈవో ఫణికుమార్ నాయుడు, సీఈ సత్యనారాయణ, అదనపు ఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేసిన పాపాలే ఓడించాయి

భూమనపై డిప్యూటీ మేయర్ మండిపాటు

తిరుపతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వెంకటేశ్వరస్వామి చెంత చేసిన పాపాలే వైసీపీ ఓటమికి కారణాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిపై మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. తిరుమల కొండపై వైసీపీ హయాంలో జరిగిన ఘటనలపై భక్తుల అభిప్రాయ సేకరణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కల్తీ నెయ్యి, దర్శనాలు, కాంట్రాక్టు పనులలో జరిగిన అవినీతిపై అభిప్రాయ సేకరణకు ముందుకు రావాలన్నారు. బీఆర్ నాయుడు ఏడాది కాలంలో అద్భుతమైన నిర్ణయాలు తీసుకోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రాజకీయ నిరుద్యోగులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

టీటీడీ చైర్మన్ అసమర్థపాలన

భూమన కరుణాకరరెడ్డి విమర్శ



తిరుపతి(రవాణా), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గడచిన ఏడాది కాలంలో టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు పాలన అసమర్థంగా ఉందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. గురువారం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చని పోవడం, 50మందికి గాయాలవడం, శ్రీవాణి ట్రస్టును రద్దు చేస్తామని చెప్పి టిక్కెట్ల సంఖ్యను మరింత పెంచడం, అన్నదానంలో వడను చేర్చి ప్రచారం చేసుకోవడం తప్ప ఇంకేం చేయ లేదన్నారు. టీటీడీ చైర్మన్ కార్యాలయాన్ని బూతుల కార్యాలయంగా మార్చారన్నారు. వైసీపీ నేతలు కోటూరు ఆంజనేయులు, నల్లాని బాబు పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో అత్యాధునిక క్యాన్సర్ వైద్యం

72 ఏళ్ల మహిళకు విజయవంతంగా ఆపరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి, పక్కన సీఈవో శ్రీధర్‌ముని

తిరుచానూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓవరియన్ క్యాన్సర్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 72 ఏళ్ల మహిళకు తిరుపతి -రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఆధునికమైన హెచ్ఐపీఈసీ(హైపర్‌టెర్మిక్ ఇంట్రాపర్సనియేల్ కిమోథెరపీ) ద్వారా విజయవంతంగా శస్త్ర చికిత్స చేసినట్లు సర్జికల్ గాస్ట్రో ఎంట్రాలజిస్టు సాయికృష్ణారెడ్డి తెలిపారు. ఆస్ప త్రిలో గురువారం అయన మీడియాతో మాట్లాడుతూ హెచ్ఐ పీఈసీ అనే అత్యాధునిక క్యాన్సర్ చికిత్స పద్ధతి ద్వారా మహిళను ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు చెప్పారు. ప్రస్తుతానికి ఆమె కోలుకుంటోందన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆస్పత్రిలోనూ ఈ టెక్నాలజీ అందుబాటులో ఉండదని తెలిపారు. ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ నెట్‌వర్క్ ద్వారా తమ ఆస్పత్రిలో ఈ చికిత్స అందిస్తున్నామన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌ముని మాట్లాడుతూ అత్యుత్తమ వైద్య బృందం, క్రిటికల్ కేర్ విభాగం సమన్వయంతో రాయలసీమలో అన్ని రకాల క్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. వైద్యులు ఎస్వీ ప్రసాద్, ప్రతిమ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రుయాలో 'మహా' దోపిడీ

- చిన్నారి మృతదేహం తీసుకెళ్లేందుకు మహాప్రస్థానం నిర్వాహకుల బేరసారాలు
- డబ్బులు ఇస్తేకానీ కదిలేది లేదని స్పష్టీకరణ
- చివరకు ఆటోలో తీసుకెళ్లిన తల్లిదండ్రులు



తిరుపతి(వైద్యం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రిలో మహాప్రస్థానం నిర్వాహకుల దోపిడీకి అంతేలేకుండా పోతోంది. లేకలేక పుట్టిన బిడ్డ అనారోగ్యంతో మృతిచెందితే ఆ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు ఆ తల్లిదండ్రులు సంప్రదిస్తే మహాప్రస్థానం నిర్వాహకులు ఆడిన బేరసారాలతో వారు అవాక్కయ్యారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన విజయ, అచ్చిబాబు దంపతుల మగబిడ్డ(10 నెలలు) కొంత కాలంగా అనార్యోగం బారిన పడుతున్నాడు. కాకినాడలోని పలు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోవడంతో గత నెల 20న రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో చేర్పించారు. వైద్యులు చిన్నారిని పీఐసీయూ విభాగంలో ఉంచి రెండు వారాల నుంచి వైద్యం అందిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున 6.30 గంటలకు చిన్నారి మృతిచెందాడు. తెచ్చిన కాస్త డబ్బు వైద్య ఖర్చులకే సరిపోయింది. బాలుడి మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో మహాప్రస్థానం నిర్వాహకులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న మహాప్రస్థానం నిర్వాహకుడు ఈ వాహనంలో కాకినాడ వరకు ఉచితంగా తీసుకువెళ్లలేమని, కేవలం 70 కిలోమీటర్ల పరిధి వరకే విడిచి పెడతామని దానికి కూడా రూ.7 వేలు వరకు ఖర్చవుతుందని చెప్పాడు. అంత ఇచ్చుకోలేమని, కనీసం రైల్వేస్టేషను వరకైనా విడిచి పెట్టాలని ప్రాధేయపడ్డారు. అతను ససేమిరా అన్నాడు. రైల్వే స్టేషను వరకు వెళ్తామని ఆస్పత్రి ముందే ఉన్న ఆటోస్టాండు వద్దకు వెళ్లి విషయం చెప్పగా వారు కూడా రూ.700 అవుతుందని చెప్పడంతో తమ వద్ద రూ.400 ఉందని ప్రాధేయపడినా ఒప్పుకోలేదు. విషయం అంతా తెలుసుకున్న ఆస్పత్రిలోని నర్సులు, ఇతర సిబ్బంది తలా కొంచెం ఆర్థిక సాయం అం దించి బయట నుంచి వారికి తెలిసిన మరో ఆటోను పిలిపించారు. బాధితులు ఆ ఆటోలో బాలుడి మృతదేహాన్ని తీసుకొనిరైల్వేస్టేషనుకు వెళ్లారు. రుయా ఆస్పత్రిలో పరిస్థితిపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు.

నేడు పాఠశాలల్లో వందేమాతర గీతాలాపన

చిత్తూరు సెంట్రల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సమూహంగా వందేమాతర గీతాలాపన చేయాలని డీఈవో వరలక్ష్మి గురువారం ఆదేశాలు జారీ చేశారు. వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి పాఠశాలలో సమూహంగా ఆలపించాలన్నారు.

టీటీడీలో ఎన్నో సంస్కరణలు చేపట్టిన బీఆర్



అంధుల శరణాలయంలో కేక్ కట్ చేస్తున్న మునికృష్ణ, సురేంద్ర నాయుడు తదితరులు

తిరుపతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు చేపట్టిన ఏడాదిలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. మునికృష్ణ ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శివజ్యోతి నగర్‌లోని ప్రభుత్వ అంధుల శరణాలయంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. మునికృష్ణ, టీడీపీ తిరుపతి అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు మాట్లాడుతూ బీఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ అయిన తర్వాత ఏఐ పద్ధతిలో సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించడం, ప్రసాదాల నాణ్యత పెంచడం, ఆయా రాష్ట్రాల రాజధానులలో శ్రీవారి ఆలయాలు నిర్మించడం, రాష్ట్రంలో ఉన్న ఎస్సీ కాలనీలలో 500 దేవాలయాలు నిర్మించడం వంటి పనులు చేశారన్నారు. అంతేగాక గత ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ముంతాజ్ హోటల్ స్థలాన్ని వెనక్కి తీసుకుని వెంకటేశ్వర స్వామి పవిత్రత దెబ్బతీయకుండా తీసుకున్న నిర్ణయం అద్భుతమైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీఎం శ్రీధర్, ధనుంజయ, జగ్గా, శ్రీరాములు, సుధాకర్, గంజి సుధాకర్ రెడ్డి, లక్ష్మి, వాణి, జయంతి, నాగ ప్రతాప్, ఉదయ్, మైనం సురేష్ పాల్గొన్నారు.

బీఆర్ నాయుడికి పలువురి శుభాకాంక్షలు

తిరుపతి, నవంబరు6(ఆంధ్రజ్యోతి) : భగవంతుడు, భక్తులకు మధ్య వారధిగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఏడాదిపాటు మెరుగైన సేవలు అందించారని టీడీపీ నేతలు కొనియాడారు. టీటీడీ చైర్మన్‌గా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద శాప్ చైర్మన్ రవినాయుడు, గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, నేతలు జేబీ శ్రీనివాస్, ఊకా విజయకుమార్, శ్రీధర్ వర్మ తదితరులు కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. ఆయన మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. నాయకులు మునిరామయ్య, సుబ్బు యాదవ్, జిమ్ ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు సుగుణమ్మ నివాసంలో ప్రజాదర్బార్

తిరుపతి, నవంబరు6(ఆంధ్రజ్యోతి) : టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ నివాసంలో శుక్రవారం ప్రజాదర్బార్ ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీల ద్వారా సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఈవోకు కోడూరు సన్మానం



తిరుపతి (నేరవిభాగం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ జన్మదినం సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాల సుబ్రహ్మణ్యం శుభాకాంక్షలు తెలిపారు. శాలువతో సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధు, ప్రమోద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



నీరబ్‌కుమార్ ప్రసాద్

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ మాజీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, తెలంగాణ హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఉన్నారు.


రుయాలో డాక్టర్ల ఘర్షణ

డాక్టర్‌పై చేయి చేసుకున్న మరో వైద్యుడు

విచారణ చేపట్టిన అధికారులు

తిరుపతి(వైద్యం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌పై ప్రైవేటు వైద్య కళాశాలకు చెందిన మరో వైద్యులు దాడికి పాల్పడిన ఘటన గురువారం రుయాస్పత్రిలో చోటుచేసుకుంది. నాలుగు రోజులుగా ఎస్వీ వైద్య కళాశాల పరిధిలో పీజీ డాక్టర్లకు పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం పరీక్షలు ముగిశాయి. అపోలో వైద్యశాలకు చెందిన పీజీ వైద్యులు పరీక్ష ఎలా రాశారు అనే విషయం తెలుసుకునేందుకు ఆ కళాశాల తరఫున ఎగ్జామినర్‌గా వచ్చిన డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పరీక్షల విధుల్లో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసులు దగ్గరకు వచ్చారు. ఆయన సరైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. గురువారం మళ్లీ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి రుయాస్పత్రిలో విధుల్లో ఉన్న డాక్టర్ శ్రీనివాసులు వద్దకు వచ్చారు. గంటల తరబడి శ్రీనివాసులరెడ్డిని విభాగం ముందే నిరీక్షింపజేశారు. సహనం కోల్పోయిన శ్రీనివాసులరెడ్డి డాక్టర్ శ్రీనివాసులు గదిలోకి వెళ్లి ఆయనపై చేయి చేసుకున్నారు. దీంతో ఇరువురు దాడులకు పాల్పడ్డారు. అక్కడే ఉన్న ఇతర వైద్యులు గుర్తించి సర్దిచెప్పారు. ఈ విషయంపై ఇరువురు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధలకు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వారు విచారణ చేపట్టారు. దాడి జరిగిన మాట వాస్తవమేనని, కారణాలపై విచారణ చేపడుతున్నామని, పూర్తి వివరాలు తెలుసుకున్నాక తగు చర్యలు చేపడతామని ప్రిన్సిపల్ రవిప్రభు తెలిపారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,239

తలనీలాలు సమర్పించినవారు: 23,436



మహిళలకు వరం పింక్ బస్సు

స్విమ్స్‌లోని పింక్ బస్సు ద్వారా 2018 నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిలో నోటి క్యాన్సర్‌ను గుర్తించేందు పరీక్షలు, బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణకు రొమ్ము పరీక్ష, మామో గ్రామ్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, పెట్ సిటీ, లీనియర్ ఎక్సలేటర్ మొదలగు పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గుర్తించేందుకు పాప్ స్మియర్ పరీక్ష కూడా పింక్ బస్సులో అందుబాటులో ఉంది.

పింక్ బస్సు సేవలు

- నిర్వహించిన మొత్తం క్యాంపులు : 692
- స్క్రీనింగ్ చేసిన రోగుల సంఖ్య : 41,783
- చికిత్స తీసుకున్నవారి సంఖ్య : 744(ఆపరేషన్లతో కలిపి)
- 2025లో (జనవరి నుంచి అక్టోబరువరకు)

ఓపీల సంఖ్య :21037, ఐపీ :5917

నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం :

క్యాన్సర్ భూతం కాదు

జబ్బు మాత్రమే

తిరుపతి

ఆంధ్రజ్యోతి

క్యాన్సర్ అనే పేరు వింటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఆందోళన, భయం మొదలవుతుంది. క్యాన్సర్ అని నిర్ధారణ అయిన వారితో పాటూ వారి కుటుంబ సభ్యుల్లోనూ, ఆత్మీయుల్లోనూ నిరాశ పేరుకుంటుంది. ఒక అసక్తత అసహనంగా మారుతుంది. అయితే క్యాన్సర్ అన్నది ఇప్పుడు మరణానికి సంకేతపదం కానేకాదు. వైద్యరంగంలో జరిగిన ఆవిష్కరణలు, కనుగొన్న మందులు, అనుసరిస్తున్న వైద్య విధానాలు.. కేన్సర్‌ను నిరోధించడమే కాదు, నియంత్రించగలుగుతున్నాయి. కేన్సర్ అని నిర్ధారణ అయినవారిలో పోరాడి గెలవాలనే పట్టుదల, వారికి స్థైర్యాన్నిచ్చే కుటుంబ సభ్యులు ఉంటే అద్భుతాలు కూడా జరుగుతాయి. క్యాన్సర్ ఎందుకు వస్తుందో కారణాలు అనేకం ఉండచ్చు కానీ మొదట్లోనే గుర్తించి వైద్యం మొదలు పెడితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. ఇలా చికిత్సతో క్యాన్సర్‌ను జయించిన వారు ఎందరో ఉన్నారు. చివరి స్టేజ్‌లో ఆస్పత్రిమెట్లెక్కి కరెంటు, కీమో థెరపీలతో పోరాడి గెలిచినవారూ ఉన్నారు. కాబట్టి క్యాన్సర్ అన్నది గతంలోలా ఇప్పుడు కబళించే భూతం కాదు. అది కూడా వైద్యంతో నియంత్రించగల ఒక జబ్బు మాత్రమే అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, స్వీకార్ డైరెక్టర్ ప్రశాంత్ చెబుతున్నారు. తిరుపతిలో క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు తగిన వైద్యం అందుబాటులో ఉందంటూ ఆ వివరాలు తెలియజేశారు.

తిరుపతిలో స్విమ్స్‌తో పాటు టాటా కాన్సర్ (స్వీకార్) ఆస్పత్రులలో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స లభిస్తున్నాయి. స్విమ్స్, స్వీకార్ వంటి వైద్య సంస్థలు 'క్యాన్సర్‌ను జయిద్దాం'..అంటూ సామాజిక ప్రచారాలు, వాక్‌థాన్, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నాయి. డోర్ టూ డోర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాల ద్వారా ముందస్తు గుర్తింపు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో క్యాన్సర్ అని అనుమానం వస్తే నిర్ధారణ కోసం వైద్యనిపుణులు పరీక్షలను సూచిస్తున్నారు. బ్రెస్ట్ కాన్సర్‌పై జాగ్రత్తలు, మహిళలకు స్వీయ పరీక్ష గురించి అవగాహన కలిగిస్తునారు. సర్జికల్ చికిత్సతో పాటు కీమోథెరపీ, రేడియోథెరపీలు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా నగదు ఖర్చు లేకుండా అందుతున్నాయి. ఎస్వీఆర్ రుయా ఆస్పత్రిలో సర్జికల్, రేడియేషన్ చికిత్స లేనప్పటికీ ఓపీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.



స్విమ్స్ క్యాన్సర్ విభాగంలో త్వరలో అందుబాటులోకి రానున్న లీనియర్ యాక్సిలేటర్

టీటీడీ సాయంతో త్వరలో 'శ్రీబయో'

క్యాన్సర్ నివారణకు ప్రభుత్వంతో పాటు టీటీడీ సహాయ సహకారాలు అందిస్తోంది. ప్రస్తుతం స్విమ్స్ క్యాన్సర్ విభాగం కోసం రూ118 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. అత్యాధునికమైన వైద్య సదుపాయాలతో 391 పడకలతో పూర్తి స్థాయిలో శ్రీ బాలాజి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ (శ్రీబయో)ని జనవరిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. క్యాన్సర్ విభాగానికి టీటీడీ రూ184 కోట్ల నిధులు కేటాయించింది. ఈ విభాగంలో లీనియర్ యాక్సలేటర్‌కు రూ24కోట్లు వెచ్చిస్తున్నారు. పెట్, గామా స్కాన్ : రూ23కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇంకా సీఎస్ఎస్‌డీ : రూ14కోట్లు, ఎంఆర్ఐకి రూ8కోట్లు వ్యయం చేస్తున్నారు.

ఏడాదికి 3వేలు పైనే

గత మూడేళ్ల గణాంకాల ప్రకారం ప్రతిఏటా సుమారు 3వేల నుంచి 3500 కొత్త క్యాన్సర్ కేసులు గుర్తిస్తున్నారు. తిరుపతి జిల్లాలో నోటి(ఓరల్), బ్రెస్ట్ (స్తన), సర్వికల్, ఊపిరిత్తుల క్యాన్సర్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయంలో క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.



త్వరలో ప్రారంభం కానున్న శ్రీబయో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

స్విమ్స్‌లో ఇవి ఉన్నాయి

క్యాన్సర్ రోగుల సౌకర్యార్థం స్విమ్స్‌లో ఓ ఎంఆర్ఐ, సిటి, పెట్ స్కాన్‌తో పాటు తాజాగా గామా కెమెరా, లినాక్ వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్బీ)) అనుమతులు ప్రక్రియ కొనసాగుతోంది. అనుమతులు లభించిన వెంటనే ఈ యంత్రాలను జనవరి నుంచి అందుబాటులోకి తీసుకుని రావడానికి ప్రణాళికలు రూపొందించారు.

పాలియేటివ్ కేర్:

చికిత్సకు లొంగకుండా చివరి దశలో ఉన్న రోగులకు పాలియేటివ్ కేర్ చాలా ముఖ్యం. స్విమ్స్‌లో క్యాన్సర్ పేషంట్ల కోసం పాలియేటివ్ కేర్ (ఉపశమన చికిత్స) విభాగం ఉంది. ఇప్పటి వరకు ఈ విభాగం ద్వారా దాదాపు 610 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వివిధ ఉపశమన చికిత్సలు అందించారు. భవిష్యత్తులో దీనిని మరింతగా విస్తరించబోతున్నారు.

స్వీకార్‌లో ఇలా..

శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్(స్వీకార్), టాటా ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు స్తన క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కోసం ఉచిత స్క్రీనింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు 60వేల మందికి పైగా వ్యక్తులు ఈ స్క్రీనింగ్ సేవలను పొందారు.

- ఓపీడీ : 152657
- కీమోథెరపీ : 32405
- రేడియేథెరపీ : 49608
- బ్రాకీ థెరపీ : 996
- సర్జరీలు : 3537

జిల్లాలో ఎక్కువగా కనిపించే క్యాన్సర్‌లు: స్తన (బ్రెస్ట్), గర్భాశయ ముఖద్వార, నోటి, ఊపిరితిత్తులు, కడుపు, పెద్దపేగు క్యాన్సర్లు.

ఇవి అవసరం

క్యాన్సర్ చికిత్సలో జరుగుతున్న పరిశోధనల ఫలితంగా అనేకరకాల ఆధునిక సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా తిరుపతికి పీడియాట్రిక్ ఆంకాలజీ (శిశు క్యాన్సర్ వైద్యం), బీఎంటీ (బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్) ఎముకమజ్జ మార్పిడి , రేడియోఆక్టివ్ అయోడిన్ చికిత్స విభాగాలు అవసరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. టీటీడీ ముందుకొచ్చి వీటిని కూడా అందుబాటులోకి తీసుకొస్తే క్యాన్సర్ బాధితులకు వరప్రసాదినిగా మిగిలిపోతుంది.

ఆస్తి నష్టం రూ.30 కోట్లు!

- 2 వేల ఎకరాల్లో ఇసుక మేట
- ముంపునకు గురైన 700 కుటుంబాలు
- ప్రభుత్వానికి తాత్కాలిక నివేదిక
- కట్ట నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం పాతపాళెం వద్ద ఓళ్లూరు చెరువు కట్ట గురువారం తెగడంతో సుమారు రూ.30 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేశారు. కళత్తూరు హరిజనవాడలో 700 కుటుంబాలు ముంపునకు గురికాగా, ఎస్ఎల్‌పురంలో 40, పాతపాళెంలో 300 కుటుంబాలకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. కళత్తూరు దళితవాడలో సుమారు 200మూగజీవాలు కొట్టుకు పోయినట్లు అంచనా. ఓ కుటుంబానికి రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లింది. రాయలచెరువు కట్ట శాశ్వత నిర్మాణానికి రూ.6కోట్లకు పైగా అవసరం. కేటీ రోడ్డు నుంచిదిగువపురం వద్ద కల్వర్టు, రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.20లక్షలు.. శాశ్వత మర్మతులకు అయితే రూ.3కోట్లు అవసరం కానుంది. 170 కరెంటు స్తంభాల కూలిపోయాయి. చెరువు దిగువ భాగాన రెండు వేల ఎకరాల్లో ఇసుక మేట వేయగా, కొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. 60 ఎకరాల్లో వేరుశనగ కొట్టుకుపోయింది. దాదాపు వెయ్యి కుటుంబాలు బాధితులుగా నిలిచారు. కలెక్టర్ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గురువారం రాత్రి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇక 200మంది పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన కళత్తూరు గ్రామంలో పారిశుధ్య పనులుచేపట్టారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవిఅ క్కడే బస చేసి బాధితులకు అన్ని సహాయ సహకారాలు అందించేందుకు చర్యలుచేపడుతున్నారు. చనిపోయిన ఆవు, గేదెకు, రూ.50వేలు, మేకకు రూ.7,500 వంతున నష్టపరిహారం అందజేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముంపునకు గురైన ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. వైద్య సేవలతో పాటురిలీఫ్‌సెంటర్లతో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు హౌసింగ్ పథకం కింద నిర్మిస్తామన్నారు. చెరువు కట్ట తెగడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉంటాయని చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్





గుంతలో పడి నీటమునిగిన ట్రాక్టరు



చెరువు నీటితో పాడైన ఇంట్లోని వస్తువులు.. శుభ్రం చేసుకుంటున్న మహిళలు

పోలీసు ఆన్ రెస్క్యూ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కళత్తూరు దళితవాడలో సహాయక చర్యలకోసం పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సీఐలు, ఎస్ఐలు, కేవీబీపురం, సత్యవేడు, పిచ్చాటూరు, పోలీసు స్టేషన్ల సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఘటనాస్థలికి చేరకుని పరిస్థితిని పరిశీలించారు. ఎప్పటి కప్పుడు నీటి మట్టం మార్పులను గమనిస్తూ గ్రామస్తులతో మాట్లాడారు. పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బందితో కలసి సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 500 ఇళ్లు నీట మునిగే పరిస్థితి ఏర్పడినా సమయోచిత చర్యలతో ప్రజలను సురక్షితంగా తరలించగలిగామని ఎస్పీ చెప్పారు. అత్యవసర పరిస్థితిలో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎస్పీ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

రెండోరోజూ ఏసీబీ సోదాలు

- పలు అక్రమ రిజిస్ట్రేషన్లు గుర్తింపు ?

రేణిగుంట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో రోజైన గురువారం కూడా ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. కార్యాలయానికి తాళం వేసి మరీ రికార్డులను నిశితంగా పరిశీలించారు. తాత్కాలికంగా క్రయ, విక్రయాలను నిలిపివేశారు. తిరుపతి రూరల్ పరిధిలోని 22 ఏ నిషేధిత జాబితాలోని మఠం భూములు, శ్రీనివాసపురం, పద్మావతిపురంలోని ఇళ్ల స్థలాలకు, ఇళ్లకు డీఐజీ, జిల్లా అధికారి అనుమతి లేకుండా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి నేరుగా వ్యక్తిగత సహాయకుడు, ఓ డాక్యుమెంట్ రైటర్, అతని తమ్ముడు ద్వారా చట్టంలోని లొసుగుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. పట్టా భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములకు సదరు భూమి నెంబర్ వేసి రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు, ఇతర జిల్లాల (ఎనీవేర్) రిజిస్ట్రేషన్ చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు తనిఖీలలో గుర్తించిన అక్రమ రిజిస్ట్రేషన్లపై ప్రొసీడింగ్స్ రూపొందిస్తుండడంతో తనిఖీలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఽఏసీబీ నివేదికను జిల్లా ఉన్నతాధికారులు పంపకుండా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యువకుడి దారుణ హత్య

- సంప్‌లో బయటపడిన మృతదేహం

రేణిగుంట నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ యువకుడు హత్యకు గురైన వైనం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం రేణిగుంట పంచాయతీ పరిధిలోని నేతాజీ కాలనీకి ఆనుకొని ఉన్న ఓ నిర్మానుష్య ప్రదేశం వద్దకు గురువారం కొంత మంది యువకులు మద్యం తాగేందుకు వచ్చారు. అక్కడి ఖాళీ భవనం నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో వారు సమీపంలోని సంపులో పరిశీలించారు. అందులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే గాజుల మండ్యం పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ఐ సుధాకర్‌లు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఎక్కడో హత్య చేసి రెండు రోజుల క్రితం కాళ్లు చేతులు కట్టేసి మృతదేహాన్ని సంపులో పడేసి ఉంటారని డీఎస్పీ చెప్పారు. మృతదేహం గుర్తించలేని విధంగా కుళ్లిపోయిందన్నారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. హత్య కేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. హత్యకు గురైన యువకుడు సమీ ప్రాంతానికి చెందినవాడిగా అనుమానిస్తున్నారు. అక్రమ సంబంధమా, ఆర్థిక లావాదేవీలా అనే కోణంలో విచారిస్తున్నారు. క్లూస్ టీం చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని రుయాకు తరలించారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కాళ్లు చేతులకు కట్టేసి ఉన్న మృతదేహం

ఎస్వీయూ సైకాలజీ ప్రొఫెసర్ సస్పెన్షన్

- ర్యాగింగ్‌ను ప్రోత్సహించారని అధికారుల ప్రాథమిక నిర్ధారణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సైన్స్ కాలేజీ సైకాలజీ విభాగ ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథరెడ్డి సస్పెండ్ అయ్యారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈనెల ఒకటో తేదీన సైకాలజీ విభాగంలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేశారని, ఇది ఆయన నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అది నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులు అమలులో ఉన్నంత కాలం తిరుపతి నుంచి వెలుపలకు వెళ్లకూడదని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సంబంధిత అధికారుల అనుమతి అవసరమని పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో సగం వేతనంతో జీవనాధార భత్యం చెల్లిస్తారు.



ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి

నీటిపాలైన బతుకు

శ్రీకాళహస్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో గురువారం రాయలచెరువు కట్ట తెగడంతో కళత్తూరు దళితవాడ జనం తీవ్రంగా నష్టపోయారు. ఎటు చూసినా ఆవేదనే. 700 కుటుంబాల వరకు ముంపునకు గురయ్యాయి. బాధితుల ఆవేదన వారి మాటల్లోనే..

భారీగా పశు నష్టం



నేను నెల్లూరులో పశువైద్య విద్య అభ్యసిస్తున్నా. పశువుల పెంపకంపై ఆసక్తితో దేశవాళీ రకమైన ఒంగోలు జాతి ఆవులు, ఎద్దులు, పాడిగేదెలను ఇంటి వద్ద మేపుతుంటా. పది ఒంగోలు ఆవులు, నాలుగు ఒంగోలు జాతి పాడిగేదెలు, 16మేకలు నీటిలో కొట్టుకుపోయాయి. ఏం చేయాలో దిక్కు తోచడంలేదు.

\- సునీల్

కూడు దొరికే మార్గమేదీ?



గేదెల ద్వారా పాలు అమ్ముకుని ఇద్దరు ఆడబిడ్డలను చదివించుకుంటున్నా. ఆ నాలుగు గేదెలు ఒకేసారి కడతేరిపోయాయి. రేపటి నుంచి మా కుటుంబానికి కూడుదొరికే మార్గంలేదు.

\- సుకన్య

మొదటిఇల్లు మాదే



సెల్‌ఫోన్ల ద్వారా చెరువు తెగిన విషయం తెలిసి జనాలు పరుగెత్తారు. నాకు ఫోన్ లేకపోవడంతో ఆలస్యంగా తెలిసింది. మాది రేకుల ఇల్లు కావడంతో బిడ్డలను తీసుకుని ఎక్కడికి పోవాలో అర్థం కాలేదు. దక్షిణ వైపు నుంచి పొలాల్లో నీటి ప్రవాహం పరుగులుపెడుతున్న దృశ్యం కనిపించింది. ఇంట్లో ఉన్న ఇద్దరు బిడ్డలను సంకన వేసుకునిఊరిలోకి పరుగులు తీసి ఓ మిద్దెపైకి ఎక్కా. మొదట నీటి ప్రవాహం మా ఇంటినే తాకింది. ఏ వస్తువూ మిగలలేదు.

\- సంపూర్ణమ్మ

ఎలా బతకాలి?



నాలుగు ఇనుప రేకులతో చుట్టూ తడికలుగాపెట్టుకుని బతికే నిరుపేద కుటుంబం మాది. నీటి ప్రవాహంలో తట్టా బుట్ట కొట్టుకుపోయాయి. నాలుగు పాత గుడ్డలు తీసుకుని రోడ్డున పడ్డాం. ఎలా బతకాలో అర్థం కావడంలేదు.

\- రఘునమ్మ

50 ఏళ్లక్రితం ఇలాంటి ఘటనే



50ఏళ్ల క్రితం ఇలాంటి ఘటనే జరిగింది. కానీ ఇంత నష్టం లేదు. అప్పుడూ రాయలచెరువు నీళ్లు మా దళితవాడపై పడింది. నీటి ఉధ్రుతి తక్కువ కావడంతో కాలువ పొంగి ప్రవహించింది. కానీ ఇంతటి విపత్తు ఎపుడూ ఊహించలేదు.

\- మోషయ్య

అందరినీ అప్రమత్తంచేశాం



రాయలచెరువుకట్టకు బొగడ పడిందని పాతపాళెం నుంచి బంధువులు ఫోనుచేసి చెప్పారు. నాతో పాటు కళత్తూరు నుంచి 20మందినితోడుపెట్టుకుని ద్విచక్ర వాహనంలో చెరువు వద్దకెళ్లాం. మా కళ్లముందే నీటి ఉధృతి పెరిగి చెరువుకట్ట తెగిపోయింది. దీంతో ఇళ్లు వదిలి పారిపోవాలంటూ అందరికీ సెల్‌ఫోన్‌తో హెచ్చరికలు చేయడంతో మిద్దెలు ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు.

\- అమాసయ్య

దాచుకున్న సొమ్ము పోయింది



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. చిల్లర దుకాణం ఉంది. ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం చేపట్టా. దీనికి రూ.3లక్షలు నగదు, కొంత బంగారు నా దుకాణంలో ఉంచుకున్నా. దీంతో పాటు వస్తువులు మొత్తం పోయాయి.

\- సౌజన్య

బిడ్డకోసం తల్లడిల్లిపోయాం



నెల రోజుల క్రితం నేను మగబిడ్డకు జన్మనిచ్చా. ఊరిని ఉప్పెన తాకడంతో బిడ్డను కాపాడు కోవడానికి ఇంట్లో వాళ్లమంతా తల్లడిల్లిపోయాం. ప్రవాహం తగ్గడంతో పొరుగున ఉన్న రామగిరికి కట్టుబట్టలతో వెళుతున్నాం.

\- సుచిత్ర

గ్యాస్, ఆయిల్ నిక్షేపాల కోసం అన్వేషణ



సూరిశెట్టిపాళెం వద్ద భూముల్లో డ్రిల్లింగ్ చేస్తున్న ఓఎన్‌జీసీ సిబ్బంది

కోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోట మండలం కొక్కుపాడు, సూరిశెట్టిపాళెం గ్రామాల్లో గ్యాస్, ఆయిల్ నిక్షేపాల కోసం గురువారం ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచ్యురల్ గ్యాస్ కార్పొరేషన్) అన్వేషణ ప్రారంభించింది. ఆయా గ్రామాల్లోని పొలాల్లో యంత్రాలతో డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. మరో రెండు రోజులపాటు ఈ పనులు డ్రిల్లింగ్ పనులు కొనసాగుతాయని ఓఎన్‌జీసీ పీఆర్‌వో సుధీర్ తెలిపారు. కోట మండలంలోని కొక్కుపాడు నుంచి కర్లపూడి, చిల్లకూరు మండలం కాకువారిపాళెం, బల్లవోలు గ్రామాల మీదుగా కృష్ణపట్నం పోర్టు వరకు శాటిలైట్ లోకేషన్ ద్వారా ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ఇందనం, గ్యాస్ నిక్షేపాల ఉనికి ఉందా, లేదా అనే విషయాలపై శాటిలైట్ విలేజ్‌ల ఆధారంగా డ్రిల్లింగ్ చేస్తున్నామని, డెల్టా ప్రాంతం కావడంతో ప్రస్తుతం 50నుంచి 60 అడుగుల లోతు మట్టిని తీసి ఓఎన్‌జీసీ పరీక్ష కేంద్రానికి పంపిస్తామని, మరోవైపు అంత లోతునుంచి అయిస్కాంత తరంగాల ద్వారా ప్రత్యేక పరికరాలు భూగర్భంలోకి పంపి గ్యాస్ నిక్షేపాలు ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తున్నామన్నారు. కోట మండలంలో ఇప్పటికి 4 ఓఎన్‌జీసీ బృందాలు అన్వేషణ ప్రారంభించాయని పీఆర్‌వో సుధీర్ పేర్కొన్నారు.

యూరియా కొరత లేదు



యూరియా పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు

చిట్టమూరు, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు అధైర్య పడొద్దని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండల కేంద్రానికి దూరంగా ఉన్న తీరప్రాంత గ్రామాలైన బురదగాలి కొత్తపాళెం, చిల్లమూరు, మొలకలపూడి గ్రామాల రైతులకు చిట్టమూరు సొసైటీ కార్యాలయం వద్ద గురువారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత లేకపోయినప్పటికి కొంతమంది అసత్య ప్రచారం చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. చిట్టమూరు మండలంలో ఇప్పటికే 4800 యూరియా కార్డులను పంపిణీ చేశామని చెప్పారు. మొదటి విడతగా 17వందల కార్డులకు 369 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేశామన్నారు. అనంతరం ఉప్పలమర్తి గ్రామంలో యూరియా పంపిణీ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించారు. అలాగే పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని దుకాణాల యజమానులను హెచ్చరించారు. ఆయన వెంట ఏడీవో ధనంజయరెడ్డి, చిట్టమూరు ఏవో నిరంజన్ కుమార్ ఉన్నారు.

ఉరివేసుకుని ఆత్మహత్య

గూడూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గల ఓ నిమ్మతోటలో గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెంది వుండటాన్ని గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్‌ఐ తిరుపతయ్య వివరాల మేరకు... మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలోని ఓ నిమ్మతోటలో 40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి నిమ్మచెట్టుకు లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదు రోజుల క్రితం మృతిచెంది వుండవచ్చని భావిస్తున్నామని పోలీసులు చెప్పారు. బులుగు గళ్లచొక్కా ధరించి వున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్‌రావు

గూడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రావు అన్నారు. గురువారం గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహించారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం అయ్యవారిపాళెం గ్రామానికి చెందిన సందీప్ అనే విద్యార్థి వైద్య ఖర్చులకు చిల్లకూరు మండలం చేడిమాల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.30వేలు అందజేశారు. బీఫార్మసీ చదువుతున్న సందీప్ అనారోగ్యానికి గురై బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చుల కోసం ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడును సంప్రదించడంతో రూ.30వేలు నగదు అందజేశారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మర్రి ప్రమీల అన్నారు. మండల పరిధిలోని వంజివాక రైతుసేవా కేంద్రంలో గురువారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్ధవరం సహకార సంఘ ఛైర్మన్ పాదర్తి కోటేశ్వరరెడ్డి, ఏవో సుచేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

పెళ్లకూరు, నవంబరు, 6(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. రెండు రోజులుగా నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, పెళ్లకూరు ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, చావాలి గ్రామాల వద్ద 71వ జాతీయ రహదారిపై స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని క్షుణంగా పరిశీలిస్తున్నారు. పోలీసులు చేపట్టిన వేగ నియంత్రణ తనఖీలు గురువారం కూడా కొనసాగాయి.

యూరియాపై వైసీపీ అసత్య ప్రచారం: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

డక్కిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యూరియా విషయంలో వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎంపీపీ గోను రాజశేఖర్, మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి పట్టణ టీడీపీ అధ్యక్షుడు డక్కిలి చంద్రారెడ్డి విమర్శించారు. గురువారం వారు డక్కిలిలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత ఉన్నట్లు వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మవద్దన్నారు. రైతులను భయాందోళనకు గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలన్న దురుద్దేశంతోనే వైసీపీ నేతలు విష ప్రచారానికి తెర లేపారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కోసం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో నియోజకవర్గంలో రైతులకు చాలినంత యూరియా అందుతుందని చెప్పారు. వైసీపీ హయాంలో ఎకరాకు ఒక బస్తా యూరియా ఇచ్చి, బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోకూరు రమేష్ నాయుడు, డక్కిలి సునీల్ రెడ్డి, దందవోలు పెంచలరెడ్డి, పిల్లి శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి రత్నయ్య, గరిటి చెంచయ్య, సునీల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షార్‌ను సందర్శించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని గురువారం సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్ర షార్‌ను సందర్శించారు. ఆమెకు షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ స్వాగతం పలికారు. అనంతరం ఆమె షార్‌లోని రాకెట్ ప్రయోగ వేదికలు, స్పేస్ మ్యూజియాన్ని సందర్శించారు. రాకెట్ ప్రయోగాలు, ప్రయోగించిన ఉపగ్రహాల గురించి షార్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటలో కుండపోత వర్షం



జలదిగ్బంధంలో ఉన్న కోట పంచాయతీ కార్యాలయం

కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో గురువారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో విద్యానగర్‌లో రోడ్లు జలమయమయ్యాయి. కోట, ఆకుతోట దిబ్బలో వర్షపునీరు నిల్వచేరి ఇళ్లల్లోకి వస్తుండటంతో ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ పంచాయతీ సిబ్బంది ద్వారా నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేపట్టారు. కోట పంచాయతీ కార్యాలయం జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో సిబ్బంది అసౌకర్యానికి గురయ్యారు.

కోడి పందేల స్థావరంపై దాడులు
ఐదుగురి అరెస్టు

కోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లిలో కోడి పందేల స్థావరంపై గురువారం ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశాడు. ఐదుగురి జూదరులను అరెస్టు చేశారు. ఐదు బైక్‌లు, మూడు కోడి పుంజులు, రూ.1850 స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్‌రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా పంచాయతీలు పనిచేయాలని డీఎల్‌డీవో జాలిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులకు గ్రామాల సుస్థిరాభివృద్ధి, లక్ష్యాలపై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలకు అర్హులను గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేందుకు పంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. 2030 నాటికి లక్ష్యాల సాధన దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అంతకుముందు అంబేడ్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలకు ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, ప్రసాద్, వసంతకుమార్, వెంకటరావు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కాళంగి పరిసరాల ప్రజలు అప్రమత్తం ఉండాలి

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాళంగి రిజర్వాయర్ పైనున్న రాయలచెరువు కట్ట తెగడంతో సూళ్లూరుపేటలో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం తహసీల్దార్ పి.గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు కాళంగి నదిని ఆనుకుని ఉన్న వత్రపాలెం, మన్నారుపోలూరు, పడమటికండ్రిగ గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఏ సమయంలోనైనా కాళంగిలో నీటి ఉధృత పెరిగే అవకాశం ఉందని. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

షార్‌లో విశ్రాంత ఇస్రో ఉద్యోగుల సమావేశం

సూళ్లూరుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో గురువారం ఇస్రో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. పెన్షన్, మెడికల్ సర్వీసు, 8వ పే కమిషన్, సీనియర్ సిటిజన్స్ రాయితీలు తదితర అంశాలపై చర్చించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్‌ను సన్మానించారు.






నీటి ఉధృతికి కొట్టుకుపోయిన పలు వాహనాలు



గ్రామంలో అస్తవ్యస్తంగా తయారైన రోడ్లు, పొలాలు

ఊరు.. ఏరై.. కన్నీరుమున్నీరై...

ఊరంతా ఏరైంది. ఒక్కసారిగా జలప్రళయంతో విలవిల్లాడిపోయింది. గ్రామంలోని దళితవాడవాసులంతా ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని మిద్దెలెక్కారు. ఏం జరుగుతుందో తెలియక ఆందోళనతో అల్లాడిపోయారు. గురువారం తెల్లవారుజామున ఓళూరు రాయలచెరువుకు గండిపడటంతో కళత్తూరు దళితవాడను నీరు ముంచెత్తింది. గంటన్నర వ్యవధిలో అతలాకుతలం చేసింది. నీటి ప్రవాహానికి ఇళ్ళలోని ధాన్యం సహా వస్తువులు, పశువులు, వాహనాలు కొట్టుకుపోయాయి. పశువులు కొట్టుకుపోయి విగతజీవులుగా మారిపోయాయి. ఊరంగా బురదనీటితో బీభత్సంగా తయారైంది. సర్వం కోల్పోయిన బాధితుల రోదనలు మిన్నంటాయి. వెనువెంటనే జిల్లా అధికార యంత్రాంగం స్పందించిన తీరు కొంత ఊరటనిచ్చింది.

- కేవీబీపురం (ఆంధ్రజ్యోతి)









ఇళ్లలోకి నీరు చేరడంతో తడిసి ముద్దయిన, నీట మునిగిన సామగ్రి, దుస్తులు తదితర వస్తువులను బయటకు తీసుకొస్తున్న బాధితులు



కొట్టుకుపోయిన కంటైనర్



నీటి ఉధృతికి తెగిన రోడ్డు, కాలువ గడ్డ



నేలమట్టమైన గుడిసెలు



ఎక్స్‌కవేటర్‌తో బురద తొలగింపు పనులు

నిస్సహాయత అలుముకుంది



కళ్లెదుటే అన్నీ కొట్టుకుపోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాం. నేను మరికొందరు స్నేహితులతో కలిసి నీటి ఉధృతి తగ్గాక సహాయక చర్యలు అందించాం.

- రాజా

సమస్తం నీటిపాలైంది



నేను ఎమ్మెసీ బీఈడీ చదివిన నిరుద్యోగిని. గ్రామంలో కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఇంట్లోని ఉపకరణలతో పాటు ధాన్యం, బియ్యం, సర్టిఫికెట్లు కూడా కొట్టుకుపోయాయి. నా జీవితం సమస్తం నీటిపాలైంది.

- జాన్సన్

సర్వం పోయింది



నేను బీఎస్సీ బీఈడీ చదివిన నిరుద్యోగిని. కూలీ పనులపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నా. నీటి ప్రవాహంలో నా ఇంట్లోని సర్వం సామగ్రి పోయింది. నా విద్యార్హత సర్టిఫికెట్లు కూడా పోయాయి.

- గాబ్రియేల్

కనీస సాయం అందలేదు



ఊరంతా ఒకసారిగా రోడ్డున పడింది. అధికారుల నుంచి కనీసం సహాయం అందలేదు. ఆకలితో అలమటిస్తున్నప్పటికీ కొన్ని వీధుల్లోకి ఆహారం, నీళ్ల రాలేదు.

- రామయ్య దంపతులు

ఏఎంసీ పాలకమండలి సభ్యులకు సన్మానం



బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి పరిచయ సమావేశం గురువారం జరిగింది. ఏఎంసీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఛైర్మన్ జ్యోతి సుధాకర్‌నాయుడు కమిటీ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం ఛైర్మన్ దంపతులను సిబ్బంది, సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, డైరెక్టర్లు, ఏఎంసీ కార్యదర్శి గంగయ్య, భాస్కర్‌యాదవ్, టీడీపీ నాయకులు మధునాయుడు, చెంచురామనాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సుల్లో భద్రతకు చర్యలు



మాట్లాడుతున్న ఎంవీఐ దామోదర్‌నాయుడు

శ్రీకాళహస్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భద్రతకు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఎంవీఐ దామోదర్‌నాయుడు కోరారు. పట్టణంలోని ఆర్టీఏ కార్యాలయంలో గురువారం ప్రైవేటు కళాశాలలు,పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బస్సుల్లో ఫైర్ అల్లారం, ఫైర్ ప్రొటెక్షన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండు అగ్ని మాపక యంత్రాలు, అత్యవసర ద్వారం తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రజలను అప్రమత్తం చేసిన తహసీల్దార్



తహనగర్‌లో పశువుల కాపరులను అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తివేత క్రమంలో గురువారం తహనగర్, చిన్నాయగుంట, పూసలపల్లి, సుద్దమిట్ట గిరిజన కాలనీ గ్రామాల ప్రజలను తహసీల్దార్ శ్రీదేవి గురువారం అప్రమత్తం చేశారు. పశువులను ఏరు ప్రాంతానికి తీసుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరద ముప్పు గ్రామాలను తాకితే జీఎన్‌కండ్రిగలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోకి రావాలన్నారు. కారణి, వెస్ట్‌వరత్తూరు గ్రామాల మధ్య కాజ్‌వేను పోలీసులు పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

చెరువుకు గండి: అప్రమత్తంతో తప్పిన ముప్పు



బొగడకు ఇసు బస్తాలు వేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేణుగోపాలపురం చెరువు తూము దగ్గర గురువారం బొగడ పడింది. రైతులు వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పింది. చెరువుకు ఎగువ నుంచి నీటి ప్రవాహం రావడంతో చెరువు తూము దగ్గర చిన్నపాటి బొగడ పడటంతో రైతులు గురించి అధికారులకు తెలియజేశారు. వీఆర్‌ఓ ఈశ్వరయ్య రైతులతో కలిసి ఇసుక బస్తాలు వేసి నీటిని బయటకు పోనీయకుండా కట్టడి చేశారు. చెరువుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉచిత పశువైద్య సేవలు

రేణిగుంట నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాస్, చైల్డ్‌ఫండ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఐపీఎల్ సమస్త ఆర్థిక సహకారంతో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. గాజుల మండ్యం, అత్తూరు, నల్లపాలెం గ్రామాల్లో ఈ శిబిరాలను రాస్ జనరల్ సెక్రెటరీ వెంకటరత్నం నాయుడు ప్రారంభించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడిరైతులకు మందులను పంపిణీ చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల సమన్వయంతో ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్య సహాయ సంచకులు, కేవీకే డైరెక్టర్ శ్రీనివాసులు, రాస్ బీబీవీపీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, రాస్ ,ఐపీఎల్ సమస్త సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి):రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం గోవిందప్పనాయుడు కండ్రిగలో రైతులకు ప్రభుత్వం అందించిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు చెరువులన్నీ పూర్తిస్థాయిలో నిండాయన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం సబ్సిడీ అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో భారీ వర్షం



పిచ్చాటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ముడియూరు, కీళపూడి, శేషంపేట, రామగిరి, పిచ్చాటూరు వంటి పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. వీధులు జలమయంగా మారింది. అరణియార్ రిజర్వాయర్ లోతట్టు ప్రాంతం నుంచి వరద నీరు ప్రవాహం ప్రాజెక్టుకు అధికంగా వచ్చింది. వర్షం సాయంత్రం వరకు కొనసాగితే అరణియార్ రిజర్వాయర్ నిండడమే కాకుండా గేట్ల ద్వారా నీటి విడుదల చేయాల్సి వచ్చేది. ఒక గంట కురిసి ఆగిపోయింది.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



బాధితులకు చెక్కులు అందజేస్తున్న బృందమ్మ

ఏర్పేడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బాధితులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స తీసుకుని నయం చేసుకున్న వారికి ఆర్థికసాయం అందజేశా రు. మునికృష్ణయ్య(పంగూరుకు)కు రూ.64,348, ఈశ్వరయ్య(చిందేపల్లి)కు రూ.84,928, నరసింహులు(సీతారాంపేట)కు రూ.35,527, హేమాద్రి(ఇసుకతాగేలి)కి రూ.18వేలు, మోహనకృష్ణ(పాతవీరాపురం)కు రూ1,53,008తో పాటు మరికొందరికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీనాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, మహేష్‌రెడ్డి, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

పరిహారం కోసం పనుల అడ్డగింత



రైతులతో మాట్లాడుతున్న రైతులు

ఏర్పేడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పరిహారం చెల్లించేవరకు తమ భూముల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేయవద్దంటూ సీతారాంపేట రైతులు ఆగ్రహించారు. వారు గురువారం నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎస్‌ఎస్ కెనాల్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ కింద మల్లిమడుగు రిజర్వాయర్‌కు నీటిని తరలించడానికి మేర్లపాక చెరువు నుంచి రెండు పైపులైన్ల ఏర్పాటు పనులు కొద్దిరోజులుగా జరుగుతున్నాయన్నారు. ఈ పనులకు వైసీపీ ప్రభుత్వంలోనే భూసేకరణ చేపట్టినా నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఈ క్రమంలో ఏర్పేడు రైల్వేస్టేషన్ వద్ద పైపులైను పనులను గురువారం సీతారాంపేట రైతులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు తిరిగి వెళ్లిపోయారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వినాయక పూజలు, కలశ పూజ వైదిక క్రతువులనంతరం వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. హారతులు ఇచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముక్కంటి సేవలో హైడ్రా కమిషనర్



ఆలయం వద్ద హైడ్రాకమిషనర్ రంగనాథ్

శ్రీకాళహస్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం తెలంగాణ హైడ్రా కమిషనర్ రంగనాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మంత్రులతో మర్యాదపూర్వక కలయిక



మంత్రి అనితకు స్వామి చిత్రపటం బహూకరిస్తున్న పద్మనాభరాజు

పిచ్చాటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పల్లికొండేశ్వర ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పద్మనాభరాజు పిచ్చాటూరు మండలానికి చెందిన టీడీపీ నేతలతో కలసి గురువారం అమరావతిలోరాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పల్లికొండేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

చంద్రగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. తొండవాడ బస్టాండు కూడలిలో మంగళవారం ఉదయం 60 ఏళ్ల వ్యక్తి రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

పుత్తూరు వార్తలు

మినీ అంగన్వాడీ కార్యకర్తలకు పదోన్నతి



భానుప్రకాష్‌తో పదోన్నతి పత్రాలు పొందిన కార్యకర్తలు


వడమాలపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లోని మినీ అంగన్వాడీ కార్యకర్తలకు పదోన్నతి ఉత్తర్వుల ప్రతులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గురువారం అందజేశారు. తిరుపతిలోని నివాసంలో మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలుగా పదోన్నతి పొందిన వారు ఎమ్మెల్యేను కలిశారు. వారిని లయన అభినందిస్తూ స్వీట్స్ తినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలను బాగా చూడాలని, విద్యాబుద్ధులు నేర్పాలని సూచించారు. టీడీపీ నాయకులు జీవరత్నం నాయుడు, ఇన్చార్జి సీడీపీవో సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

వడమాలపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని భవాని శంకర దేవాలయంలో శుక్రవారం నుంచి పుష్కర కుంభాభిషేక త్రిదిన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు గోపూజ, గణపతి పూజ, ఏకాదశి రుద్ర కలశస్థాపన, సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు, శనివారం రుద్రాభిషేకం, చండిహోమం, విశేషద్రవ్యాలతో అభిషేకం, అర్చన సాయంత్రం సహస్ర నామార్చన, కుంకుమార్చన, ఊంజలసేవ, ఆదివారం ఉత్సవ మూర్తుల అభిషేకం, రుద్ర హోమం, సుదర్శన హోమం, సాయంత్రం పార్వతీపరమేశ్వరుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డుపై శవ పంచాయితీ

- మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వని బంధువులు
- పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కారం



ఇంటికి తాళం వేసిన బంధువులు



ఇంటి ముందు మృతదేహంతో రమాదేవి కుమారుడు, కుమార్తె

శ్రీకాళహస్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ విబేధాలు రోడ్డుపై శవపంచాయతీకి దారితీశాయి. పోలీసుల జోక్యంతో చివరకు సమస్య పరిష్కారమైంది. వివరాలిలా.. పట్టణంలోని సినిమావీధిరి చెందిన రమాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా రిటైరైంది. ఆమె కొన్నాళ్లు స్వగృహంలోనే ఉంది. అయితే కుటుంబ విబేధాలు కారణంగా కొద్ది సంవత్సరాల నుంచి కొడుకు సురేష్, మనవరాలు రిష్మికలతో కలిసి పుత్తూరులో ఉంటోంది. ఈ క్రమంలో అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. తల్లి కోరిక మేరకు కొడుకు సురేష్ ఆమె శవాన్ని అంతిమ సంస్కారాలు శ్రీకాళహస్తిలోని స్వగృహంలో నిర్వహించాలని భావించాడు. గురువారం ఉదయం మృతదేహాన్ని ఇంటి వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే ఆస్తి విబేధాల నేపథ్యంలో ఆ ఇంట్లో ఉంటున్న బంధువులు ససేమిరా అన్నారు. శవాన్ని ఇంట్లోకి రానివ్వమంటూ ఇంటికి తాళం వేశారు. దీంతో సురేష్ రోడ్డుపై బైటాయించి శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ రవి సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. తర్వాత శవాన్ని ఇంట్లోకి తరలించాక . అంతిమ సంస్కరాలను బంధువులు పూర్తిచేశారు.

శ్రీసిటీని సందర్శించిన ఏపీ ఎన్నికల కమిషనర్



సాహ్ని దంపతులను సన్మానిస్తున్న సన్నారెడ్డి

సత్యవేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని , భర్త కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి అజయ్ ప్రకాష్ సాహ్నితో కలిసి గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు సాదర స్వాగతం పలికారు, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు మేకిన్ ఇండియా కార్యక్రమానికి సహకారం, ఉపాధి సృష్టి, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో శ్రీసిటీ కీలక పాత్రను వివరించారు. గతంలో అజయ్ సాహ్ని విలువైన సూచనలతో సాంకేతిక, తయారీ రంగంగలో శ్రీసిటీకి నూతనోత్సాహం తెచించదని డా. సన్నారెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. శ్రీసిటీ పెట్టుబడుల అనుకూల వాతావరణం, ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలను నీలం సాహ్ని ప్రశంశించారు. ప్రకాష్ సాహ్నే శ్రీసిటీతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ధనుష్



వరదయ్యపాళెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థి వీ. ధనుష్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల మదనపల్లెలో జరిగిన అండర్ 14 చెస్ పోటీలలో పాల్గొన్న ధనుష్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. మన్యం జిల్లాలో జరగనున్న ఎస్‌జీఎఫ్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి ధనుష్‌కు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

కారు డ్రైవింగ్‌పై శిక్షణ

చంద్రగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 13 నుంచి 30 రోజుల పాటు ఉచితంగా పురుషులకు, మహిళలకు లైట్ మోటార్ వెహికల్ కారు డ్రైవింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి చదివి ఉండాలని వెల్లడించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒకసారి చార్జీలు ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం ధృవపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672లను సంప్రదించాలని కోరారు.

రాయలచెరువుకు గండి
బాధితులకు పరిహారమివ్వాలి: సీపీఎం



జనార్ధన్

సత్యవేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయల చెరువుకు గండి బాధితులకు తగిన పరిహారం చెల్లించాలనిసీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. గురువాంలం వరదముంపు గ్రామాలను ఆయన సందర్శించారు. అనంతరం జనార్ధన్ మీడియాతో మాట్లాడుతూ పంట పొలాలు ఇసుక మేటలు వేసి సాగు చేయడానికి వీలులేని పరిస్థితి నెలకొని ఉందన్నారు. పాతపాళెం వెళ్ళే రహదారి పూర్తిగా ధ్వంసమైందన్నారు. బాధిత రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు., ఇళ్ళల్లో నీరువచ్చి జలమయమైన కుటుంబాలకు రూ.10వేలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కన్నులపండువగా
శివపార్వతుల కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన ముక్కోటి



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

చంద్రగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలలో గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, ఆనందవల్లిదేవికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ఆవరణలోని నటరాజ కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం దీపారాధన చేసి, స్వామి అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ముక్కోటి భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఐటీసీ గోదాములో అగ్నిప్రమాదం



అగ్నికి ఆహుతైన సామగ్రి

పుత్తూరు అర్బన్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కాపువీధిలోని ఐటీసీ పేరుతో ఉన్న గోదాములో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు బాధితులు తెలిపారు. చాక్లెట్లు, సిగరెట్లు, ఇతర నిత్యావసర వస్తువులు కాలిపోయాయన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. ఈ ఘటనలో రూ.1.20 లక్షలు నష్టం వాటిల్లి ఉండవచ్చని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జ్ అధికారి గిరిధర్ పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు



మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ నందికొట్కూరు మున్సిపాలిటీ మేనేజర్‌గా నియమితులయ్యారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గురువారం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కావలి మున్సిపాలిటీ శానిటరీ సూపర్‌వైజర్న్ డీవీ .నాగేశ్వరరావును పుత్తూరు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈయన సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.